బాక్సింగ్ పోటీల్లో నీలిమకు స్వర్ణ పతకం

విశాలాంధ్ర - భీమునిపట్నం: భీమునిపట్నం మండలం టి.నగర పాలెంకు చెందిన విద్యార్థి నీలిమ నేపాల్ దేశంలో జరుగుతున్న అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలలో స్వర్ణ పతకం సాధించింది. ఇటీవల రాష్ట్ర నాయకులు నీలిమ ప్రతిభకు తోడ్పాటు సహాయ సహకారాలు అందించడంతో ఇంతటి ఘన విజయం సాధించింది. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు వాసు రాజు, పంచాయతీ ప్రెసిడెంట్ పోట్నూరు చాయగౌతమి చంద్రశేఖర్, మాజీ ప్రెసిడెంట్ పోట్నూరు రాము, ఎంపీటీసీ సభ్యులు పల్ల సన్యాసిరావు నీలిమ, మాజీ ఎంపీటీసీ సభ్యులు కోరాడ అప్పలనరశయ్య, పంచాయతీ బోర్డు మెంబర్ పూసర్ల రామారావు యాదవ్, గ్రామ పెద్దలు నీలిమను సన్మానించి అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వాలు మైండ్‌గేమ్ ఆపాలి

అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల రాస్తారోకో

విశాలాంధ్ర - విశాఖ: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి ప్రభుత్వాలు చాపకింద నీరులా నిర్వీర్యం చేయడం తగదని, మైండ్ గేమ్ ఆపాలని అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి నాయకులు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబరు 10న రాస్తారోకోలు చేయాలని జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం విశాఖలో స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ పోరాట కమిటీ జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం నుండి ఆశీలమెట్ట మీదుగా లలిత జ్యూయలర్స్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. విశాఖ ఉక్కు - తెలుగోడి హక్కు, ఎవడ్రా అమ్మేది - ఎవడ్రా కొనేది, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని నినాదాలతో హోరెత్తించారు. రోడ్డుపై కార్యకర్తలు బైఠాయించడంతో బస్సులు, ఇతర వాహనాలు ఆగి ట్రాఫిక్ నిలిచిపోయింది. టూ టౌన్ పోలీసులు కార్మిక సంఘాల నాయకులను ప్రక్కకు లాగడానికి ప్రయత్నించినప్పటికీ పట్టుదలగా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు, సిఐటియు జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వ రరావు, ఐ.ఎన్.టి.యు.సి. జాతీయ నాయకులు బి.నాగభూషణం, ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర నాయకులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు జూన్ 11న వచ్చిన కేంద్ర మంత్రి ప్లాంట్‌ను ప్రైవేట్ చేయబోమని, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని, అయినా నేడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు రెండు నిలుపుదల చేస్తున్నారని అన్నారు. సొంత గనులు సమకూర్చకపోగా గంగవరం పోర్టు నుండి రావాల్సిన బొగ్గును సైతం నిలుపుదల చేయడం సిగ్గుచేటన్నారు. నేటికీ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో విలీనం చేయలేదని విమర్శించారు. కనీసం ఎన్.ఎం.డి.సి నుండి ఖనిజం కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల నుండి అప్పులు తీసుకోవడానికి గ్యారంటీ ఇవ్వకపోవడం నేడు ప్లాంట్‌ను కుంగతీస్తున్నాయని చెప్పారు. ప్రధానమంత్రిని విశాఖ స్టీల్ ప్లాంట్‌పై రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరి కలిశారని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టీల్ మంత్రి కుమార్ స్వామిని, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారని, కానీ ఫలితం శూన్యమని అన్నారు. గత రెండు నెలల్లో విశాఖ స్టీల్ పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని, ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ఇప్పటివరకూ ఒక్కశాతం కూడా ప్రైవేట్‌పరం కాకుండా పోరాటంతో అడ్డుకున్నామని భవిష్యత్తులో కూడా మోడీ, చంద్రబాబుల మెడలు వంచైనా దీనిని కాపాడుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పి.మణి, షేక్ రెహమాన్, పి.వెంకటరెడ్డి, గణేష్ పాండా, ఎం.సుబ్బారావు, దేవా, అప్పలరాజు, శేఖర్, మౌళి, నరేంద్రకుమార్, వి.ఇందిరా, ఓ.అప్పారావు, పి.లక్ష్మి, వామనమూర్తి, తిరుపతిరావు, నూకరాజు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

లయోలా వృద్ధాశ్రమానికి బాలసురక్ష సేవాసంస్థ చేయూత

విశాలాంధ్ర - పెందుర్తి: ఎందరో అభాగ్యులకు నీడనిచ్చి ఆదరిస్తున్న పెందుర్తి లయోలా వృద్ధాశ్రమానికి విశాఖ నగరానికి చెందిన బాల సురక్ష సేవాసంస్థ చేయూతనందించింది. ఆ సంస్థ వ్యవస్థాపకులు శ్రీరాజ్ గొర్ల, కార్యనిర్వాహకులు నిర్మలానంద, సభ్యులు సుగుణ, పద్మ సహా పలువురు వాలంటీర్లు లయోలా వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడ ఆపన్నులకు అందుతున్న సేవల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమానికి ఆరు స్టీల్ మంచాలను కానుకగా అందచేశారు. బాలసురక్ష ప్రతినిధులను లయోలా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నరవ రహదారి కష్టాలకు విముక్తి కల్పిస్తాం: ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని నరవ రహదారి కష్టాలకు విముక్తి కల్పిస్తామని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు స్పష్టం చేశారు. అధికారులతో కలిసి గోపాలపట్నం కొత్తపాలెం మీదుగా సబ్బవరం వెళ్లే రహదారి మార్గాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి సమస్యలపై ఆరా తీసారు. ప్రజలతో మాట్లాడి రహదారి కష్టాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరవ రహదారిపై పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుతో చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆక్రమణలు తొలగించి రోడ్డు, కాలువలు నిర్మిస్తామని తెలిపారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కాగా నరవ లోతట్టు ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీలను తక్షణమే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు.

రక్షణ సహాయక చర్యల్లో అలసత్వం వద్దు

గ్రామాల్లో ఆపదమిత్ర బృందాలు ఏర్పాటు కావాలి

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. వైపరీత్యాల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన జరిగిన నష్టాలపై, తీసుకున్న సహాయక చర్యలపై విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్.పిలతో విశాఖపట్నం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం ఉదయం ఆమె సమీక్షించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి జాయింట్ పోలీస్ కమిషనర్ డా. కె.ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ గత 15 రోజుల్లో రాష్ట్రంలో రెండు తుఫాన్లు వచ్చాయని, ఈ నెల 8, 9 తేదీల్లో భారీ వర్షాలు కురిసాయని అన్నారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, విజయవాడలో తీసుకున్న సహాయక రక్షణ చర్యల మాదిరిగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇందుకు జిల్లా కలెక్టర్లు పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో జిల్లా కలెక్టర్లు నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లాల్లోని జలాశయాల స్థితిగతులపై సమీక్షిం చాలని తెలిపారు. ఎప్పటికప్పుడు రిజర్వాయర్ల గేట్లు పనితీరును పునః సమీక్షించుకోవాలని, పనిచేయని, పాడైన గేట్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటికి అవసరమైన అంచనాల నివేదికలను సమర్పిం చాలని కోరారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిసారి సర్వే చేసుకోవాలని, ఇందుకు జిల్లా కలెక్టర్లు బాధ్యత వహించాలని తెలిపారు. అలాగే భారీ వర్షాల సమయంలో పొరుగు రాష్ట్రాల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాల్లోని ముంపు, పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ముందుగా తరలించేందుకు వీలుంటుందని అన్నారు. ఇందుకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని వివరించారు. ప్రతికూల పరిస్థితిల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చేయడమే కాకుండా, రక్షణ సహాయక చర్యల్లో ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలతో పాటు మత్స్యకారుల బోట్లను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో 5గురు సభ్యులతో ఆపదమిత్ర బృందాలను సిద్ధం చేసి, వారికి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసిన సహాయక చర్యలపై తగిన శిక్షణను ఇవ్వడం ద్వారా ఆయా గ్రామాల్లో ముందస్తు రక్షణ చర్యలకు మరింత అవకాశం కలుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతల్లో భారీ వర్షాలు కురిశాయని, ఈ నెల 7, 8 తేదీల్లో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో కొంత మేర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. ఎక్కడికక్కడ సహాయక చర్యలు చేపట్టామని, జలాశయాల్లో గరిష్ట స్థాయికి నీరు లేనందున పరిస్థితి అదుపులో ఉన్నట్లు వివరించారు.

ఈ సమావేశంలో ఆర్డీఓలు డి.హుస్సేన్ సాహెబ్, పి.భాస్కరరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మత్స్య, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, ఏపీఈపిడిసిఎల్, ఆర్ అండ్ బి, ఆర్.డబ్ల్యు.ఎస్, జిల్లా అగ్ని మాపక అధికారి, ఉప రవాణా తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్.ఐ.విపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బోని గ్రామంలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్

ఆధ్వర్యంలో మంగళవారం “మీకు తెలుసా” కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో లింక్ వర్కర్ స్కీమ్ సిఎల్‌డబ్ల్యూ ఎం.జ్యోతి మాట్లాడుతూ హెచ్.ఐ.వి. లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2 నెలల పాటు నాకో నేతృత్వంలో మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.కృష్ణారావు, సిహెచ్ ఓ.జాశ్వంత్, ఏఎన్ఎం ఎస్.కే.బాజియా, అంగన్వాడీ టీచర్స్ గౌతమీ, లక్ష్మి, ఆశ కనక రత్నం గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో వీఎంఆర్డీఏ కీలక పాత్ర

విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్

విశాలాంధ్ర - విశాఖ: విశాఖపట్నం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, భవిష్యత్తు తరాలు ఇబ్బందులు పడకుండా చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్ళాలని, దానికి వీఎంఆర్డీఏ కీలక భూమికను పోషించాల్సి ఉందని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్ అన్నారు. ఆయన మంగళవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో మెట్రోపాలిటన్ కమీషనర్ కెఎస్ విశ్వనాథన్‌తో కలిసి అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న బృహత్తర ప్రణాళికను ప్రజలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన వర్గాలతో చర్చించి సవరించడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్ ఏ డీ పై వంతెన వద్ద ఆర్‌ఓబీ, అండర్ పాస్‌లను ఎన్‌హెచ్ఎంఐ, రైల్వే వర్గాలతో సంప్రదించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సిరిపురం జంక్షన్ వద్ద నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ ను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. వీఎంఆర్డీఏ సందర్శన స్థలాల్లో పర్యాటకులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, అదే సమయంలో వారిని ఆకర్షించే విధంగా కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డి.కీర్తి, చీఫ్ ఇంజనీర్ వి.భవానీ శంకర్, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికా అధికారి సంజయ్ రత్న కుమార్, ముఖ్య గణాంకాధికారి వై. హరిప్రసాద్, పిసిపిఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్ప, ఎస్ఈ ఎం.బలరామరాజు, డిఎఫ్ఓ శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం కూడలిలో రాస్తారోకో, ఉద్రిక్తత

- కార్మిక సంఘాల నేతల అరెస్టు, స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు

విశాలాంధ్ర - గాజువాక/కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని, ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తూ, ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ పోరాట డిమాండ్ చేసింది. రాష్ట్ర స్థాయి రాస్తారోకో సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో మంగళవారం రాస్తా రోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో కొంత సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాస్తారోకో సందర్భంగా కూర్మన్న పాలెం కూడలిలో భారీగా పోలీసులు మోహరించారు. రాస్తారోకో చేస్తున్న కార్మిక సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, కన్వీనర్ కె.ఎస్.ఎన్.రావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు, నాయకులు వై.టి.దాస్, విల్లా రామ్మోహన్ కుమార్, పల్లా పెంటారావు, పి.వి.రమణ మూర్తి, విశాఖ ఉక్కు శ్రామిక సంఘం నేత బొడ్డు పైడిరాజుతో పాటు మరో 15 మంది ఉన్నారు.

మొక్కలు నాటడం ప్రతిఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర - ఆనందపురం: పచ్చదనం పరిరక్షణలో భాగంగా రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీ జనసేన నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణానికి తమ వంతు బాధ్యతగా పంచాయితీ పరిధిలో మొక్కలు నాటుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాండ్రంకి వెంకటేష్, సీతరాజు, రాము, సూర్యనారాయణ, కార్యదర్శి దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

కొండవాలు పరిసర ప్రాంతాలపై అప్రమత్తత అవసరం: ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - తగరపువలస: వర్షాల కారణంగా కొండవాలు ప్రాంతాల్లో ప్రజలకు నష్టం వాటిల్లకుండా చూడాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. తగరపువలస సత్యనారాయణ మెట్ట కొండవాలు ప్రాంతాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నప్పుడు కొండవాలు నుంచి రాళ్లు, మట్టి జారి పడుతున్నందున స్థానికులు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల కురిసిన కుంభవృష్టి సమయంలో 20 ఇళ్ల వారిని ముందు జాగ్రత్తగా తరలించామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న మంచినీటి ట్యాంకుకు పైప్ లైన్లు బిగించి తొందర్లోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. పారిశుధ్య పరిస్థితి మెరుగుపరచాలన్నారు. నిర్మాణం పూర్తయిన చిట్టివలస రైతుబజార్‌ను సాధ్యమైనంత త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు చెప్పారు. రూ.78 లక్షలతో నిర్మించిన రైతు బజార్‌లో 36 స్టాల్స్ ఉన్నాయని, ఇందులో 27 రైతులకు, మిగిలినవి సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు, సూపర్ బజార్ తదితరాలకు కేటాయిస్తారన్నారు. అనంతరం భీమిలి బీచ్‌లో వర్షాల కారణంగా కోతకు గురైన సముద్ర తీరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి, పార్టీ నాయకులు గాడు అప్పలనాయుడు, గంటా నూకరాజు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

13 నుండి 17 వరకు ఆర్జిత సేవలు రద్దు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనర సింహస్వామి స్వామివారి ఆలయంలో ఈ నెల 13 నుండి 17వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసాచార్యులు తెలిపారు. పాంచ రాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం వార్షిక ఉత్సవాల్లో భాగంగా అప్పన్న ఆలయంలో పవిత్రోత్సవాలు జరపటం ఆనవాయితీ. వైదిక సంప్రదాయం ప్రకారం జాతా శౌచం (పురిటి మైల), మృతాశౌచం (మృతితో అంటు), స్త్రీల బహిష్టు కారణాల వల్ల ఆలయంలో తెలిసీతెలియక కొన్ని తప్పులు చోటు చేసుకుంటాయి. అలాంటి దోషాల పరిహారణార్థం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇవి కేవలం భక్తుల వల్లే కాకుండా ఆలయంలో వివిధ హెూదాల్లో పనిచేసే ఉద్యోగులు, అధికారుల వల్ల కూడా జరగవచ్చు. వీటి వల్ల ఆలయ పవిత్రతకు ఎటువంటి లోపం రానీయకుండా ఆ దోషాలను నివారించేందుకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో

విశాలాంధ్ర - భీమిలి: సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు వైయస్సార్ విగ్రహం వద్ద స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రవ్వ నర్సింగరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని ప్రభుత్వం రంగ సంస్థలని కాపాడాల్సిన ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడానికి పూనుకుం టుందని అన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి నరేంద్ర మోడీకి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్తారని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నమ్మినాయుడు, పల్లా పెంట రాజు, పల్లా రమణ, పల్లా రామకృష్ణ, ముఠా ఆటో వివిధ రంగాల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

SBFC
ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్ : యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ నం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకాల గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059 (టెలిఫోన్ : +91 22 67875300), ఫ్యాక్స్: +91 22 67875334 (WWW.SBFC.COM) కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య:యు67190ఎంహెచ్2008పిటిసి178270
బహిరంగ ప్రకటన
దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా **తేదీ: 20 సెప్టెంబరు, 2024 - ఉదయం 10.30 గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో** వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది. వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా రుణగ్రహీతల ఖాతాదారుల లోన్ ఎకౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుంచి వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు...ఈ కింద పేర్కొన్న బ్రాంచ్ వివరాలతో పాటు పేర్కొన్న ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎకౌంట్లకు చెందినవి.
వైజాగ్ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.43-9-205, గ్రౌండ్‌ఫ్లోర్, సుబ్బలక్ష్మీనగర్, రైల్వే న్యూకాలనీ, మోర్ సూపర్‌మార్కెట్ ఎదుట, విశాఖపట్నం-16, ఆంధ్రప్రదేశ్-530016 AP00413686,AP00431563,AP00585124, AP00594482,AP00614742
మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సంప్రదింపు నంబరు(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్ కలిగియున్నది.

వరద ప్రభావిత కస్టమర్లకు బజాజ్ అలియంజ్ సహాయం

విశాలాంధ్ర - విశాఖపట్నం: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వరద ప్రభావితం వల్ల నష్టపోయిన తమ వినియోగదారులకు బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సత్వర సహాయాన్ని అందించనున్నట్టు సంస్థ ప్రకటించింది. ఈ మేరకు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ సెటిల్మెంట్లు చేస్తుందన్నారు. ఈ క్లిష్టమైన సమయాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ అండగా నిలుస్తుందన్నారు. కస్టమర్ ప్రశ్నలకు సమాధానాలు అందించడానికి ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయబడిందన్నారు. అవాంతరాలు లేకుండా క్లెయిమ్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. కస్టమర్ సపోర్ట్ కోసం అత్యవసర టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ 1800 209 7072 ఏర్పాటు చేశామని, సులభమైన క్లెయిమ్ ప్రాసెసింగ్ సదుపాయాన్ని అందించేందుకు బజాజ్ అలియంజ్ తన కస్టమర్లకు షేర్ చేసిన ఎస్ఎంఎస్ అడ్వైజరీలో క్లెయిమ్ రిజిస్ట్రేషన్ లింకులు చేర్చబడ్డాయని చెప్పారు.

బజాజ్ ఫైనాన్స్ ఈక్విటీ షేర్ల విక్రయ ఆఫర్

విశాలాంధ్ర - విశాఖపట్నం: బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ ఈక్విటీ చర్ల విక్రయానికి ఆమోదం తెలిపింది. ఈ ఈక్విటీ షేర్లు ఆగస్టు 30 నాటి కంపెనీ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ద్వారా అందించబడుతున్నాయి. రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ ద్వారా అందించబడే ఈక్విటీ షేర్లు బి ఎస్ సి లిమిటెడ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో కలిసి స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జాబితా చేయబడాలని ప్రతిపాదించబడ్డాయి. ఆఫర్ యొక్క ప్రయోజనాల కోసం ఎన్ఎస్ఈ అనేది నియమించబడిన స్టాక్ ఎక్స్ఛేంజ్. బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఈ ఆఫర్ గాను కొటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ లిమిటెడ్, బోఫా సెక్యూరిటీ ఇండియా లిమిటెడ్, యాక్సిస్ క్యాపిటల్ లిమిటెడ్, గోల్డ్ మాన్ సాచెస్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్బిఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్, జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్ బుక్ రన్నింగ్ ఆఫ్ ది లీడ్ మేనేజర్స్‌గా వ్యవహరిస్తున్నాయి.

ఏపీ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌కి అభినందన

విశాలాంధ్ర - భీమిలి: ఉమ్మడి విశాఖ జిల్లా బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపాలపట్నం హైస్కూల్ క్రీడా ప్రాంగణం నందు అండర్ 16 బాల బాలికల టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాల నుండి 300 క్రీడాకారులు పాల్గొన్నారు. భీమునిపట్నం ఏపీ ఆర్ ఎస్ గర్ల్స్ నుండి ఆకాలి భువన శ్రీ (8వ తరగతి) నుండి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ నెల 13, 14, 15వ తేదీలలో తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే అంతర్ జిల్లాల టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. భువనశ్రీ ఎంపిక పట్ల ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయప్రకాశ్, పిఈటి యం.మహాలక్ష్మి ఉపాధ్యాయలు, భీమిలి బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ, జిల్లా జాయింట్ సెక్రటరీ మాకాల శంకర్‌రావు అభినందించారు.

చిన్న నాయుడు గారి కల్లాలులో అన్నదానం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధి చిన్న నాయుడు గారి కల్లాలులో మంగళవారం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి మహా అన్నదాన కార్యక్రమంను బంటుపల్లి అప్పలనాయుడు, సాదు రావు, ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 1000 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలతో అన్న ప్రసాదం సేవించారు. ప్రతి ఏడాది స్వామివారికి అన్నసంతరణ కార్యక్రమం చేపట్టడం చాలా ఆనందంగా ఉందని, బుధవారం నిమజ్జనోత్సవంకు భక్తులందరూ విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని ఉత్సవ కమిటీ తెలిపింది.

సామూహిక కుంకుమ పూజలు

విశాలాంధ్ర - ఆనందపురం: వినాయక ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఆనందపురం పంచాయతీ దొంతల వారి కల్లాలలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పురోహితులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజలో పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం వినాయక ప్రసాదాలు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో మహిళలు దొంతల సన్యాసమ్మ వరలక్ష్మి, భారతి హేమ, మంగమ్మ, హైమ, గౌరీ, అప్పల సూరమ్మ, కనక, బి.సన్యాసమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ లిమిటెడ్ ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ నేడు ముగింపు

విశాలాంధ్ర- విశాఖపట్నం: క్రాస్ లిమిటెడ్ తన ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ఐపిఓ ను విడుదల చేసింది. మొత్తం ఆఫర్ పరిమాణంలో రూ. 250 కోట్ల వరకు తాజా ఇష్యూ మరియు రూ. 250 కోట్ల వరకు అమ్మకానికి ఆఫర్ ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ తేదీ శుక్రవారం, సెప్టెంబర్ ఆరు న జరగగా బిడ్ ఆఫర్ ఈనెల 11 బుధవారం మూసివేయబడుతుంది. ఆఫర్ యొక్క ప్రైస్ బ్యాండ్ ఒక్కో ఈక్విటీ షేర్‌కి రూ. 228 నుండి రూ. 240 కనిష్టంగా 62 ఈక్విటీ షేర్‌ల కోసం ఆ తర్వాత 62 ఈక్విటీ షేర్‌ల గుణిజాల్లో వేలం వేయవచ్చు. క్రాస్ లిమిటెడ్ కంపెనీ తాజా ఇష్యూ నుండి వచ్చే నికర ఆదాయాన్ని రూ. 70 కోట్లుగా అంచనా వేయబడిన యంత్రాలు పరికరాల కొనుగోలు కోసం మూలధన వ్యయ అవసరాలకు నిధుల కోసం ఉపయోగించాలని ప్రతిపాదిస్తోంది.

నీటి వనరుల పునర్జీవనంపై అవగాహన

విశాలాంధ్ర - భీమిలి: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ, జోన్-1, భీమిలి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నీటి వనరుల పునర్జీవనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చెరువులు, వాగులు వంటి వాటి మీద అక్రమ కట్టడాలు కట్టడం వలన ఎప్పుడైన బారీ వర్షాలు, వరదలు తదితరములు వంటివి వచ్చినప్పుడు నీరు ఎటు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడి జనాలు నివసించే ఇళ్ళల్లోకి నీరు ప్రవేశించి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వి.డి.ఫణి రాం, డి.లక్ష్మి, వై.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

విజయవాడ పలు కాలనీలో వరద నీటి అడ్డంకుల పరిశీలన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విజయవాడ పలు కాలనీలలో వరద నీటి అడ్డంకులను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ పరిశీలించి వాటి తొలగింపు పక్రియ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆయా ప్రదేశాలను పర్యటిస్తూ మంగళవారం విజయవాడ నుండి తెలిపారు. విజయవాడ 64వ వార్డు కండ్రిక, ఎస్.ఎస్.సి బోస్ నగర్, ప్రజాశక్తి నగర్, మధురానగర్ తదితర ప్రాంతాలలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆధ్వర్యం లో జీవీఎంసీ కమిషనర్, జీవీఎంసీ అధికారులు వరద నీటికి కాలువలలో అడ్డంకులు ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదేశాల మేరకు కాలనీలో వరద నీరు తొలగించేందుకు జెసిబి, ప్రొక్లైన్లను ఉపయోగించి వరద నీరు,మురుగు తొలగించేందుకు చర్యలు చేపట్టామని, వరద తగ్గిన ప్రాంతాలలో వ్యర్థాలతో తొలగింపు కార్యక్రమాలను చేపట్టామని కమిషనర్ తెలిపారు.

అవ్యాన్ రియల్టర్స్ ఎల్.ఎల్.పి సంస్థ అనధికార ప్రహరీ నిర్మాణం తొలగింపు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు అవ్యాన్ రియల్టర్స్ ఎల్.ఎల్.పి సంస్థ రైన్ ఫోర్స్ మెంట్ కాంక్రీట్ తో నిర్మించిన అనధికార ప్రహరీ గోడ నిర్మాణాన్ని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 4న తొలగించడమైనదని మంగళవారం జోన్-1 అసిస్టెంట్ సిటీ ప్లానర్ డి.శ్రీనివాసరావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ జోన్-1 పరిధిలోగల ఎస్.ఓ.ఎస్ విలేజ్ జంక్షన్, స్మశాన వాటిక వద్ద బీచ్ ను ఆనుకొని అవ్యాన్ రియల్టర్స్ ఎల్.ఎల్.పి సంస్థ అనధికారికంగా నిర్మించిన ప్రహరీ గోడను జీవీఎంసీ అధికారులు తొలగించారు. సి ఆర్ జెడ్ పరిధిలో ఏపీ సి.జెడ్.ఎమ్.ఎ అనుమతి లేకుండా అనధికార ఆర్.సి.సి ప్రహరీ గోడను బీచ్ ను ఆనుకొని అవ్యాన్ రియల్టర్స్ ఎల్.ఎల్.పి సంస్థ నిర్మించిందని, ఆ నిర్మాణాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సెప్టెంబర్ 4వ తేదీనే తొలగించి హైకోర్టుకు నివేదిస్తున్నామన్నారు. తదుపరి హైకోర్టులో విచారణ అనంతరం హైకోర్టు తీర్పు ప్రకారము కమిషనర్ వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ సిటీ ప్లానర్ తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ పాటించాల్సిందే

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పిల్లల మనోవికాసానికి ప్రభుత్వ నిర్దేశిత సెలవులు పాటించాలని, పిల్లల మనో వికాసానికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖలు నిర్దేశించిన ప్రతినెలా రెండో శనివారం, ప్రతీ ఆదివారంతోపాటు వివిధ నిర్దేశిత పండగలు సెలవులను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపి ఎస్సిపిసిఆర్), జిల్లా విద్యా శాఖలు సంయుక్తంగా బాలల హక్కుల పరిరక్షణలో గాజువాక, పెద గంట్యాడ మండలాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్ల పాత్రపై మంగళవారం శ్రీనగర్‌లో గల ఏవిల్ పాఠశాల సమావేశ మందిరంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ కాలేషా బేగం అధ్యక్షత వహించారు. గాజువాక, పెద గంట్యాడ ఎం.ఈ.ఓలు బి.విశ్వనాథ్, సునీత, రమనాజీ, ఈ.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సదస్సు నుద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక యాజమాన్యాల ప్రైవేటు పాఠశాలలు బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్న అంశాలు కోకొల్లలుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదుల రూపంలో అందుతూనే ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా సెలవులు పాటించడంలో మీన మేషాలు లెక్కిస్తున్నందున విద్యార్థులు మానసికానందానికి దూరంగా ఉంటుండడాన్ని తమ కమిషన్ సీరియస్‌గా తీసుకుంటున్నట్టు తెలిపారు. నూటికి నూరుశాతం ప్రభుత్వ సెలవులు అమలు జరపాల్సిందేనని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో లైంగిక దాడులు నిర్మూలన, మంచి, చెడు స్పర్శలపై అవగాహన, ఆడపిల్లల బుతు స్రావం సమయంలో ఒత్తిడి లేని విద్యను అందించే ఆరోగ్య సూత్రాలు అమలు, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు, పిల్లలు ఫిర్యాదులు చేసేందుకు వీలుగా పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు, వాటి పరిశీలనకు ప్రత్యేక దృష్టిపై నిర్విరామంగా దృష్టి సారిస్తున్నామని అన్నారు. గ్రీన్ ఎంబీసీ ఫౌండర్ ఉమారాజ్, సైకాలజిస్ట్ ఎం.వంశీ, క్లినికల్ సైకాలజిస్ట్ పార్వతి కాశ్యప్ మాట్లాడుతూ బాలల మనో వికాసంతోనే వారిని అభివృద్ధి పథంలో నడపొచ్చని, ఒత్తిడితో కాదన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా వక్తృత్వ పోటీలు, పాఠశాలల్లో వివిధ అవగాహనా బోర్డులు ఏర్పాటు, ర్యాలీలు,వివిధ రంగాల వైద్య,సమాజ ప్రభావిత నిపుణులతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటుతో హర్షించదగ్గ పిల్లల సమాజాన్ని చూడగలమని అన్నారు. జిప్సా అధ్యక్షులు పాలవలస భాస్కరరావు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ సూచనలు పాటిస్తూ బాలల హక్కుల సంరక్షకులుగా తాము పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వ శిక్ష అభియాన్ ఏ.పి.సి.శ్రీనివాస్, గాజువాక చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నీలవేణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అరుణ, పాఠశాల కరస్పాండెంట్ టి.బలరామ కృష్ణ, స్వాంతన ఎన్జీఓ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఝాన్సి లక్ష్మి, జిప్సా కార్యదర్శి గిరీష్ శ్రీనివాస్, పి.ఓ.ఐ.సి.రమేష్, సివిల్ లీగల్ రైట్స్ జిల్లా ప్రెసిడెంట్ కే.రామలక్ష్మి, రెండు మండలాల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్ రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ: జగన్ రెడ్డికి దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇబ్బందులు వస్తున్నా వాటిని అధిగమించి సీఎం చంద్రబాబు పరిపాలన అందిస్తున్నారు అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అక్రమ కేసులు పెట్టి చంద్రబాబు నాయుడు ను జైలు లో పెట్టి ఏడాది పూర్తి అయిందని, జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పులకు రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. బుడమేరు పరిస్థితి తెలియని జగన్మోహన్ రెడ్డి రోజుకో అబద్ధం ఆడుతున్నారన్నారు. ప్రభుత్వం వలనే విజయవాడ కు వరదలు వచ్చాయని అసత్య ప్రచారాలు చేయడం తగదన్నారు. ఏడు పదులు వయస్సులోను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ వరద ప్రాంతాలను పర్యటిస్తూ సహాయక చర్యలు పరిశీలించారు అని అన్నారు. ఇవే వరదలు జగన్మోహన్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు వస్తే ఏరియల్ సర్వే చేసి మమా అనిపించేవారు అని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి విజయవాడలో రెండు ప్రాంతాల్లో పర్యటించి ఒక కోటి రూపాయలు విరాళం ఇచ్చి చేతులు దులుపుకున్నారు అని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను చూసి జగన్ బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్రలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని, సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రజలు ఆశీస్సులు, సహకారాలు అందించాలి అని ఆయన కోరారు. చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని అశాభావం వ్యక్తం చేశారు. టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ మాట్లాడుతూ పులివెందుల ఎమ్మెల్యే అమలు చేయడానికి వీలులేని హామీలు ఇచ్చారన్నారు. గత ఐదేళ్లలో ప్రశ్నించినవారి గొంతులు నొక్కి అక్రమంగా అరెస్టులు చేయించారు అని అన్నారు. కేసు రిజిస్టర్ అయి 22 నెలలు అయిన తరువాత చంద్రబాబు పేరు చేర్చి కక్ష సాధింపులో భాగంగా అరెస్టు చేశారని ధ్వజమెత్తారు.

చంద్రబాబు అక్రమ అరెస్టే జగన్మోహన్ రెడ్డి పతనానికి నాంది పలికింది అని చెప్పారు. జగన్మోహన్ రెడ్డి అక్రమాలను చూసిన ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తగిన బుద్ధి చెప్పారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలిని హితోపలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి సీఎం చంద్రబాబు ఒక్కొక్క హామీని నెరవేర్చుకుంటూ వస్తున్నారని చెప్పారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఉరుకూటి నారాయణ, విల్లూరి భాస్కరరావు, మహిళా అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, విల్లూరి చక్రవర్తి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమ్మినేని మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలి

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని, నిర్దేశిత లక్ష్యాల మేరకు రోజువారీ స్టేజ్ అప్డేషన్ ప్రక్రియను నిర్వహించాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. యంత్రాంగానికి అన్ని విధాలుగా సహకరించి పనుల్లో చురుకైన కదలిక వచ్చేలా చర్యలు చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. జిల్లాలోని ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇతర అంశాలపై గృహనిర్మాణ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, ఈపీడీసీఎల్, ఇంజినీరింగ్, సచివాలయ సంక్షేమ కార్యదర్శులతో మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ మీటింగు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. స్టేజ్ అప్డేషన్ లో భాగంగా ప్రత్యేక వాహనాల ద్వారా లబ్ధిదారులను లేఅవుట్ వద్దకు తీసుకెళ్లి జియో ట్యాగింగ్ చేయించాలని ఆదేశించారు. సచివాలయ సంక్షేమ కార్యదర్శి లబ్ధిదారులను మొబలైజ్ చేయాలని, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లబ్దిదారులకు అన్ని విధాలుగా సహకరించి నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనికి జోనల్ కమిషనర్లు పూర్తి సహకారం అందించాలని, గైడ్ చేయాలని చెప్పారు. లే ఔట్లలో అప్రోచ్ రోడ్లు పక్కాగా వేయాలని, నీరు అందించాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ముందు పని చేయించే అధికారి విశ్వాసంగా ఉండాలని.. లబ్ధిదారుల్లో నమ్మకం కల్పించాలన్నారు. గుత్తేదారులు బాధ్యతగా వ్యవహరించాలని, నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చొరవ చూపాలని నిర్దేశించారు. ఇకపై ఎవరూ నిర్మాణాల విషయంలో కారణాలు చెప్పొద్దని.. పనిపై శ్రద్ధ పెట్టి మరింత పురోగతి సాధించాలని హితవు పలికారు. సమావేశంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, సాధించిన ప్రగతి గురించి గృహ నిర్మాణ శాఖ పీడీ అఖిల వివరించారు. సమావేశంలో వీఎంఆర్డీఏ, జీవీఎంసీ, గృహనిర్మాణ శాఖ అధికారులు, గుత్తేదారులు, వర్చువల్ విధానంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు శ్రద్ధ పెట్టాలి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం స్థానిక ఎంపీపీ రాంబాబు ఆధ్వర్యంలో పంచాయతీ, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పలు శాఖలకు సంబంధించిన అధికారులని గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఏర్పడిన విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేలా విష జ్వరాలు రాకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని తెలియజేశారు. గ్రామ కార్యదర్శులు గ్రామాల్లో ఉన్న మంచినీళ్ల ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తున్నట్లు తెలియజేశారు. భారీ వర్షాలు వల్ల కొన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయని స్తంభాలు నేలకొరవడం వీధిలైట్లు సరిగా వెలగకపోవడం కొన్నిచోట్ల కరెంటు తీగలపై చెట్లు కొమ్మలు రాలటం వంటి వాటిపై శ్రద్ధ పెట్టి వీలైనంత తొందరగా పని పూర్తి చేయాలని తెలియజేశారు. కొన్నిచోట్ల పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయని వాటిని ఆన్ ఆఫ్ చేయటానికి స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్లక్ష్యం వహించ వద్దని తెలియజేశారు. విద్యుత్తు సరఫరా సరిగా లేకపోయినప్పటికీ కూడా రెడ్డిపల్లి ,శేరికాండ గ్రామాల్లో అధిక బిల్లులు వస్తున్నాయని ఆ గ్రామ కార్యదర్శులు సభలో వివరించారు. ప్రతి గ్రామంలో ఉన్న పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని ఎంపీపీ సంబంధించిన శాఖ అధికారులను ఆదేశించారు. జడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు ఏదో ఒకచోట ఒక సమస్య ఉన్నప్పటికీ దాని పరిష్కారం కోసం ఒక ఫీడర్ లో ఉన్న గ్రామాలు అన్నింటికి విద్యుత్తు నిలిపి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చలం మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలం మొత్తం సుమారు 98 ఎకరాల్లో పంట నీట మునిగి నష్టం వాటిల్లిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీ వైస్ చైర్మన్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో అన్నదానం

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెం బిసి కాలనీలో భారీ మండపంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్య స్వామిని స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు దర్శించుకొని పూజాదికాలు నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ ముమ్మన దేముడు కమిటీ ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు వడ్డించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, సూర్య కుమారి, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.